**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 14.12.2025** **సమయం: 1.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ కొద్దిసేపటి క్రితం ముగిసింది. 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి సాయంత్రానికి ఫలితాలు వెల్లడిస్తారు.
2. రాష్ట్రంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించాలంటూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.
3. బొగ్గు రంగంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు తీసుకు రాబోతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.
4. దేశవ్యాప్తంగా ఈ రోజు ఇంధన పొదుపు దినోత్సవం జరుపుకుంటున్నారు.

.................................................................

**పోలింగ్**

రాష్ట్రంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది. ఈ ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూ లైన్లలో ఉన్న వాళ్లకు ఓటేసే అవకాశం కల్పిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం రెండో విడుతలో మొత్తం 4వేల 332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 415 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. రిజర్వే షన్లు, ఇతర సమస్యలతో 6 గ్రామాల్లో ఎన్నికలు జరగటం లేదు. దీంతో 3వేల 911 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ స్థానాల్లో 12వేల 782 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అలాగే, ఈ విడతలో 29వేల 913 వార్డు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ స్థానాల్లో 71వేలకు పైగా అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈ దఫాలో 57లక్షల

22వేల 565 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 193 మండలాల్లో 38వేల 337 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఉదయం 11 గంటల సమయానికి 56.71శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కించి, ఫలితాలను ప్రకటిస్తారు. సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారు.

..........జీఎస్

**ప్రశాంతంగా జిల్లాల పోలింగ్**

హన్మకొండ జిల్లాలోని ఐదు మండలాలలో నేడు రెండవ విడత గ్రామపంచాయతీ పోలింగ్ జరిగింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.

అటు వరంగల్ జిల్లాలోని 4 మండలాల్లో పోలింగ్ జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పోలింగ్ ను పర్యవేక్షించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 7 మండలాల్లో పోలింగ్ తీరును అధికారులు వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలించారు.

మంచిర్యాల జిల్లా లోని కాసీపేట పోలింగ్ స్టేషన్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమారు సందర్శించారు.

ఆసిఫాబాద్ జిల్లాలోని 6 మండలాల్లో ఈ రోజు జరిగిన రెండవ విడత పోలింగ్ లో భాగంగా పలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి సహా ఇతర అధికారులు పరిశీలించారు.

కరీంనగర్ జిల్లాలోని 5 మండలాల్లో ఈ రోజు పోలింగ్ జరిగింది.

ఖమ్మం జిల్లాలో జరిగిన పోలింగ్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్, పర్యవేక్షించారు.

కామారెడ్డి జిల్లాలోని 7 మండలాల్లో ఈ రోజు రెండవ విడత పంచాయితీ ఎన్నికలు జరిగాయి.

జనగామ జిల్లాలోని 73 గ్రామపంచాయితీలకు ఈ రోజు పోలింగ్ జరిగింది.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు.

వికారాబాద్ జిల్లాలో జరిగిన పోలింగ్ ను కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యవేక్షించారు.

సంగారెడ్డి జిల్లాలో జరిగిన పోలింగ్ ను వెబ్ క్యాస్టింగ్ ద్వారా అధికారులు పరిశీలించారు.

ములుగు జిల్లాలో పోలింగ్ సరళిని కలెక్టర్ దివాంకరా పర్యవేక్షించారు.

......All District PTC's

**ప్రమాణ స్వీకారం**

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారానికి సంబంధించి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల తొలి సమావేశం నిర్వహించడంతోపాటు నూతన సర్పంచులు, వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

..........జీఎస్

ఉత్తమ్

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులపై పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు అనుమతులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టు నిలుపుదల, సమ్మ క్క సాగర్ క్లియరెన్సులు తదితర అంశాలపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతా రావుకు మంత్రి నిన్న లేఖ రాశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా అనుమతులు ఇవ్వాలని లేఖలో కేంద్రాన్ని ఉత్తమ్ కోరారు. ప్రాజెక్టు అనుమతుల్లో జాప్యం వల్ల రైతులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

.........జీఎస్

**తుమ్మల**

యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వచ్చే నెల,

ఫిబ్రవరి లో అత్యధికంగా యూరియా వినియోగించబోతునందున దానిని నిల్వ చేసి పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. నిన్న మంత్రి సచివాలయంలో ఎరువుల సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వ సహకారంతో రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

..........డెస్క్

**కిషస్ రెడ్డి**

బొగ్గు రంగంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తీసుకురాబోతోందని, ఇకపై ప్రభుత్వ బొగ్గు సంస్థలు పూర్తి అంకితభావంతో పనిచేస్తే తప్ప వాటిని ఎవరూ రక్షించలేరని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. సింగరేణి సంస్థ సుస్థిర మనుగడ కోసం బొగ్గు విక్రయ ధరల తగ్గింపు, నాణ్యత పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. కొత్త బొగ్గు బ్లాకులు సాధించడానికి చొరవ చూపాలని, కార్మిక సంక్షేమంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిన్న హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో కేంద్ర మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తెచ్చిన నూతన కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

.........డెస్క్

**కూనంనేని**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని ఏడవ వార్డు బూతులో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

........భద్రాద్రి

**కుంభం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

........యాదాద్రి

**నాగర్‌కర్నూల్ జిల్లా**

నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన రెండవ విడత పోలింగ్ లో పలువురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తూడుకుర్తి గ్రామంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, తిమ్మాజిపేట మండలం నేరెళ్లపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్థన్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

........పిటిసి

**ఇంధనం**

ఈరోజు దేశ వ్యాప్తంగా 'జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం' జరుపుకుంటున్నారు. ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగించడం, భవిష్యత్తు తరాల కోసం వాటిని సంరక్షించాల్సిన ప్రాముఖ్యత గురించి ప్రజలలో, ముఖ్యంగా విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. దేశంలో మొదటి జాతీయ ఇంధన పొదుపు దినోత్సవాన్ని 1991లో జరుపుకున్నారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (BEE) ప్రతి సంవత్సరం ఈ వేడుకలను నిర్వహిస్తుంది. అనవసరమైన శక్తి వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ క్షీణతను నివారించడం, ఇంధన-సమర్థవంతమైన పద్ధతులు, సాంకేతికతలను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశాలు. శక్తి

వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించడం ద్వారా సుస్థిరమైన భవిష్యత్తుకు దోహదపడాలని ఈ రోజు గుర్తుచేస్తుంది.

.........జీఎస్

**రేషన్ :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2024 సెప్టెంబరులో నియమించిన రేషన్ డీలర్ల ఎంపికను రద్దు చేస్తూ హైకోర్టు నిన్న ఆదేశాలు జారీ చేసింది. మళ్లీ నోటిఫికేషన్ జారీచేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని స్పష్టం చేసింది. సిరిసిల్ల రెవెన్యూ డివిజన్లో వివిధ కారణాలతో ఖాళీ ఏర్ప డిన 58 రేషన్ దుకాణాల డీలర్ల భర్తీకి 2024 ఆగస్టు 29న అప్పటి ఆర్డీవో నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ నియామకాలు చెల్లవని, మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలంటూ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది.

.........పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

రైళ్లు

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు పలు ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4వ తేదీ నుంచి ఈ ప్రత్యేక రైళ్లు పలు స్టేషన్ల మధ్య నడుస్తాయని వివరించారు. అలాగే, శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం వచ్చేనెలలో నాలుగు ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు పేర్కొన్నారు. చర్లపల్లి-కొల్లాం మార్గంలో ఈ రైళ్లు నడుస్తాయని వెల్లడించారు.

........డెస్క్

**గైడ్ లైన్స్**

హైదరాబాద్ లో కొత్త సంవత్సరం వేడుకల కోసం 3 స్టార్, 5 స్టార్ హోటళ్లు, క్లబ్బు, పబ్బు, బార్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఈవెంట్లతో కార్యక్రమాలు నిర్వహించాలంటే కనీసం 15 రోజుల ముందే అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఈమేరకు పలు మార్గదర్శకాలను విడుదల చేశారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తగిన భద్రతా సిబ్బంది నియమించుకోవాలని పేర్కొన్నారు. ఈవెంట్లలో అసభ్యత, నగ్నత్వం

ఉండకూడదని, బహిరంగ ప్రదేశాల్లో రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ సిస్టమ్ నిషేధమని స్పష్టం చేశారు. ఇండోర్ ప్రాంగణాల్లో మాత్రమే రాత్రి 1 వరకు, 45 డెసిబుల్స్ లోపే శబ్దానికి అనుమతి ఉంటుందని తెలిపారు. మద్యం సేవించిన వినియోగదారుల కోసం డ్రైవర్లు లేదా క్యాబ్ లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత యాజ మాన్యాలదేనని పేర్కొన్నారు. బాణసంచా ప్రదర్శనలకు కూడా అనుమతి లేదన్నారు.

........డెస్క్

**పీజీ సీట్లు**

తెలంగాణలో వైద్య విద్య బలోపేతానికి గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కొత్తగా 511 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను పెంచడంతో పాటు భారీగా నిధులను కేటాయించినట్లు కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్ నిన్న రాజ్యసభలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

.........డెస్క్

**క్రికెట్**

ఐదు టీ20 మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా ఈరోజు ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగే మూడవ మ్యాచ్‌లో భారత్, దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. ఈ మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుంది.

..........ఎన్ఎస్డీ

**దర్శనాలు**

యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రానికి ఈ రోజు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండకింద కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు, కొండపైకి చేరుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. సాధారణ దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పడుతోందని అధికారులు తెలిపారు.

.........యాదాద్రి